


# ఎంఆర్ టుటోరియల్స్‌లో యమా కోటింగు

పెద్ద మాటలు మాట్లాడతా ఉన్నానని అనుకోకపోతే ఇప్పుడీ నక్సలైట్లు ఉన్నారే అట్టాం టోళ్లబ్బా టూషను ఐవోర్లంటే.

ఈళ్ల పద్దతులు వేరే. పాటాలు చెప్పే ప్రోసీజరు వేరే. పెట్టే పరీక్షలు వేరే. ఇచ్చే నోట్సులు వేరే. ఇస్కూలితో నిమిత్తం లాకుండా 'పారలల్లు గవర్నమెంటు' అంటా ఉంటారే అట్టాంటిది నడపతా ఉంటారు టూషనులో.

అసలికి అప్పటిదాకా మా ఊళ్లో టూషన్లంటే ఎట్లా ఉండేయి?

పిలకాయలు ఏ ఇస్కూల్లో చదవతా ఉంటే ఆ ఇస్కూల్లోని ఇంగిలీషు ఐవోరి కాణ్ణో, లెక్కల ఐవోరికాణ్ణో చేరతా ఉండేవోళ్లు మొక్కుబడికి.

ఆ ఐవోర్లు పిలకాయల్ని వాళ్ల వరండాల్లో కూచోబెట్టి, సదువుకోండిరా అని ఒక కేకేసి, ఐవోరమ్మలతో మాటలు చెప్తా, కాపీలు తాగతా, మద్య మద్యలో వాళ్ల పిలకాయల్ని తీసకెళ్లి క్రాపులు చేయించుకొని వస్తా, కూరగాయలు తెస్తా, ఆ వాటంలోనే పాటాలు కూడా

చెప్తా ఎట్నో బండి లాక్కొని వొస్తా ఉండేవాళ్లు. పిలకాయలు కూడా పొయ్యామంటే పొయ్యాం వొచ్చేమంటే వొచ్చాంగా ఉండేవోళ్లు.

అయితే మేం పదికొచ్చేసరికి పరిస్తితి మారి పొయ్యింది. అట్టాంటి టూషన్లు పొయ్యి ఊళ్లోకి కొత్తగా రెండు టుటోరియల్సు వొచ్చినాయి. అట్టా రావడానికి కారణం గూడా ఉంది. ఇప్పుడంటే తుమ్మినా చీదినా డీఎస్సీ అని అంటా ఉన్నారుగానీ అప్పుట్లో బిఎలు, ఎంఎలు చదివి బిఇడిలు, ఎంఇడీలు చేసి ఉద్యోగం ఎప్పుడొస్తదిరా దేవుడా అంటా కుర్రోళ్లు గోళ్లు గిల్లుకుంటా తిరగతా ఉండేవోళ్లు గదా. అట్టాంటి కుర్రోళ్లలో కొంతమంది, ఇట్టా ఉత్తనే ఉంటే ఎట్టా అనుకొని, గ్రూపులుగా నిలబడి, సొంతంగా టుటోరియల్సు తెరుచుకోవడం మొదలుబెట్టినారు.

అట్టా మా పాతూరులో తెరిచిన దాని పేరే 'ఎంఆర్ టుటోరియల్సు'.

'ఎం.ఆర్' అంటే 'మనోహర్' అని అర్థం. ఆయన పేరులోని మొదటి అక్షరాన్ని చివరి అక్షరాన్ని కలిపి పొట్టి చేసి ఎంఆర్ టుటోరియల్స్ అని తెరిచినాడు మా మనోహర్ ఐవోరు. అసలికే ఉద్యోగాలు రాక, టీలకీ సిగరెట్లకి డబ్బులులాక, ఎంతకాలంరా ఓరే మిమ్మల్ని మేపేది మా కర్మానికి అని అమ్మానాయనలు తిడతా ఉంటే కసిగా పెట్టిన టుటోరియల్సు గదా అ కసంతా పిలకాయల మీద చూపించడం మొదలుబెట్టారు ఎంఆర్ ఐవోరు, అందులోని తక్కిన టూషను ఐవోర్లు.

ఇంకేముంది. ఆడ చేరిన పిలకాయలు టెన్తులో టకటకా ప్యాసయిపోతా ఉన్నారన్న టాకు ఊరంతా వొచ్చేసింది. దాంతో రావందాడి మొదలు. అమ్మానాయనల అడావిడి మొదలు. పోలోమంటా పిలకాయలని చేర్పించడం మొదలు.

ఆ అడావిడిలో కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు, కాండూరి మురళీగాడు, నేనూ ముందు ఎనకా ఆలోచించకుండా పొయ్యి గబగబా చేరిపోయినాం ఎం.ఆర్‌లో.

కానీ చేరినాక తెలిసింది ఆ టూషనుకి అంత మంచి పేరు ఎట్టా వొచ్చిందో పిలకాయలు ఆడ టకటకా టెన్తు ఎందుకు ప్యాసవతా ఉన్నారో.

ఆడ ప్రదానంగా జరిగే పనులు రెండు.

ఒకటి పాటాలు బాగా చెప్పడం. రెండు తన్నులు బాగా తన్నడం.

ఈ కోటింగుల దెబ్బకి మా పని ఇస్కూల్లో చెప్పు దెబ్బ, టూషనులో చేట దెబ్బ అన్నట్టుగా తయారయ్యింది.

సాదారణంగా మా ఇస్కూల్లో ఏ ఐవోరికైనా మా మీద కడుపు మండి, మా మీద పడి, కాల్తోటి చేత్తోటి ఫుల్లుగా కోటింగు ఇచ్చేసినాడనుకోండి... మేం పెద్దగా గాబరా పడకుండా, ఓహో అలాగా, సరే అయితే అనుకొని, ఇస్కూలు నుంచి బయటికొచ్చి, కుళాయిల కింద మొకాలు కడుక్కొని, ఎనకజేబు దువ్వెనతో తలకాయలు దువ్వుకొని, 'బాయ్‌రా మామా' అంటే 'బాయ్‌రా మామా' అనుకొని ఏమీ ఎరగనట్టుగా ఇళ్లకి చేరుకునేవాళ్లం.

ఎందుకంటే మా ఇస్కూల్లో అందరం మొగపిలకాయలమే కాబట్టి, ఎవరి ముందర ఎవరం తన్నులు తిన్నా కొత్తగా పొయ్యే పరువులు ఏమీ లేవుగాబట్టి.

కానీ ఎంఆర్ టుటోరియల్స్‌లో చేరినాక కొత్త బాద వొచ్చి పడింది.

ఈడ గరల్స్ హైస్కూలు ఆడపిలకాయలు పదిమంది దాకా చేరున్నారు టూషనుకి.

ఈళ్లంతా సాయంత్రమైతే చాలు వేణ్ణీళ్లు పోసుకొని, పోడర్లు రాసుకొని, బొట్టు బిళ్లలు పెట్టుకొని, పయిటా పావళ్లు గట్టి కళకళలాడతా బొమ్మల్లాగా వొచ్చి కూచుని ఉండేవాళ్లు బెంచీల మీద.

ఈళ్ల ముందర ఎంఆర్ ఐవోరు మా మర్యాద మాకు కాపాడవచ్చుగా. అహ. దొరికి నోణ్ణి దొరికినట్టు కుమ్మిపార్నూకడం మొదలుబెట్టినాడు. ఉత్త దెబ్బలైతే సయిస్తాముగానీ యిట్టా ఆడపిలకాయల ముందర దెబ్బల్ని సయిస్తామా?

మాకు మండిపొయ్యింది. మేం కూడా మనుషులమే, మేం కూడా అంజీ హోటల్లో ఉప్పూ కారాలున్న పులిబొంగరాలు తిని పెరిగినోళ్లమే, మాకూ రోషాలూ పౌరుషాలూ ఉంటాయి, ఈ అన్యాయాన్ని ఎట్టాగయినా ఎదిరించకతప్పదు అనుకొని, ఆరోజు రాత్రి టూషను వొదిలినాక రాంబాయమ్మ అంగడికాడ, కరెంటు స్తంబం కింద నిలబడి సీక్రెటు మీటింగు పెట్టినాం.

ఈ మీటింగులో పాల్గొన్న యిప్లవయిూరులు నలుగురు.

ఒకడు పులిచేరి శ్రీహరిగాడు (మాదవయ్య బడి), రెండోవాడు టంకు శ్రీనుగాడు (ఏబిఎం స్కూలు), మూడోవాడు కేశవరాజుగారి అబ్బాయి మదుసూదనరాజుగాడు (ఇశ్వోదయ బి సెక్షను), నాలుగోవాణ్ణి నేను.

శ్రీదరువాళ్ల నాయనకీ ఎంఆర్ ఐవోరికీ దోస్తీ ఉన్నందువల్ల ఎంఆర్ ఐవోరి చేతిలో శ్రీద రుగాడికి తన్నుల బాద లాకపోయినా, పోనీలే ఫ్రెండ్లు కదా చేతనైన సాయం చేద్దాం అని వాడు కూడా హాజరు అయినాడు మా మీటింగుకి.

మీటింగుని నేను మొదలుబెట్టాలి.

'మామా ఏందిరా ఇది అసలకి. అసలకి ఇది ఏందిరా మామా' అన్నాను నేను ఏం మాట్లాడలో తెలియక ఒకే మాటని తిప్పిస్తా, మళ్లిస్తా.

'అదేరా నాకూ అర్దం గావడంలా. ఇట్టా కొట్టడం ఏందిరా మిమ్మల్నా? ఇది చాలా గలీజు పనిరా. దిసీజ్ వెరీ బ్యాడ్ అండ్ అగ్లీరా' అన్నాడు కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు మా మీద జాలిపడతా.

ఆ మాటకి పులిచేరి శ్రీహరిగాడికి దుక్కం ముంచుకొచ్చేసింది.

'ఒట్టి అగ్లీ కాదురా. డర్టీ కామా శాండ్ కామా బురదరా. దీనికి మనం పెద్ద పులుస్టాపు పెట్టాలిరా. ఇంకొక్కసారి ఎంఆర్ ఐవోరు గనక నన్ను ఉతికేటప్పుడు ఆడపిలకాయలు కిసుక్కుమని నవ్వితే నేను బతకనురా. ఆనేక నా ఆత్మశాంతి కోసరం మీరంతా ప్రార్దనలు చెయ్యాల్సి ఉంటుందిరా' అన్నాడు కళ్లమ్మట నీళ్లు తెచ్చుకుంటా.

ఆ మాటలకి మా మనసులు ఎట్టెట్టో అయిపోయినాయి. మాకు తెలుసు వాడి బాద. ఆ సాయంత్రమే మా ఎంఆర్ ఐవోరు వాణ్ణి 'కింగ్ డేవిడ్' పజ్జెం మొత్తంగా ఒప్పజెప్ప నందుకు ఈ చెంపా ఆ చెంపా వాయగొట్టాడు. మా బతుకులకి కింగ్ డేవిడ్ పజ్జాన్ని అర్దం చేసుకోవడమే ఎక్కువ. ఇంక ఐదు స్టాంజాలున్న ఆ పజ్జాన్ని బట్టీగొట్టి తిరిగి ఒప్పజెప్పా లంటే అయ్యే పనేనా?

'చచ. ఊరుకోరా. అయ్యేం మాటలురా' అన్నాం వాడి బుజం మీద చేతులేసి దైర్యం చెబుతా. కానీ పులిచేరి శ్రీహరి దుక్కం చూసేసరికి కేశవరాజుగారి అబ్బాయి మదుసూద

నరాజుగాడికి మాత్రం ఎగశ్వాస వచ్చేసింది.

'ఒరే. మీరు వాణ్ణి ఆపగలరేమోగానీ నన్ను మాత్రం ఆపలేరురా. నేను పుట్టింది రాజుల వంశంలోరా. పైగా నేను క్రిష్ణంరాజు ఫాన్సునిరా. మా ఇంట్లో అటక మీద మా తాతల నాటి కత్తులు ఇంకా రెండు అట్టనే ఉన్నాయిరా. తీసకొచ్చి బొబ్బిలి బ్రమ్మన్నలాగా కళ్లు ఎర్రంగా చేసుకొని ఎవర్నో ఒకర్ని పొడిచి పార్నూకుతానురా. పీడపోద్దిరా' అన్నాడు ఛాతీ పొంగిస్తా.

అది చూసి మేము వాణ్ణి 'కంట్రోలు రా. కంట్రోలురా' అన్నాం.

పాపం వాడి బాద వేరే. వాడికి కొంచెం నత్తి ఉంది. 'కింగ్ డేవిడ్' పజ్జెం మొత్తం వాడికి కంటతా వొచ్చేసినా ఒప్పజెప్పేటప్పుడు నత్తి వల్ల ఆగిపోతా ఉన్నాడు మద్యలో. ఎంఆర్ ఐవోరేమో పద్యం రాక ఆగిపోతా ఉన్నాడేమో అనుకొని, వాడి జుట్టు పట్టుకొని నెత్తి మీద టపటపా మొటిక్కాయలు యిచ్చాడు కోటింగు. దాంతో వాడు ప్రస్తుతానికి మనిషి మని షిలా లేడు.

ఈలోపల టంకుశ్రీనుగాడికి కూడా కోపం వచ్చేసింది.

'మామా. నా సంగతి తెలుసుగదా. మా నాయన గవర్నమెంటు ఆస్పత్రి కాడ కొబ్బరి బోండాలు అమ్మతా ఉంటాడు. కాయలు చెక్కే కత్తులు కూసుగా బలే ఉండాయి రెండు. నేను కూడా పట్టకొస్తా. దెబ్బకి తలకాయలు తెగి కింద పడాల్సిందేరా' అన్నాడు వాడు.

నిజానికి వాడు బలే శాంతం మనిషి. లావుగా ఉంటాడని 'టంకు'శ్రీను అని పిలస్తా ఉంటాముగానీ వాడు నెలకొకరోజు మటను, నెలకొకరోజును చికెను తింటా, తక్కిన రోజులన్నీ ఆకుకూరలతో సర్దుకొని మెత్తగా ఉండే పిల్లోడు. అట్టాంటోడే అట్టాంటి మాటలు మాట్లాడతా ఉన్నాడంటే మా అందరి కోపాలు ఎంత దాకా పోయేయో చూడండి.

'దానమ్మనిగొట్టా మనల్ని కొడితే కొట్టాడురా. ఆ చేత్తోనే ఆడపిలకాయలని కూడా ఎయ్ దెబ్బా అని ఉతికి పార్నూకాలిగదరా. వాళ్లు మనకన్నా మొద్దులు కదరా' అన్నాడు పులిచేరి శ్రీహరిగాడు కళ్లు తుడుచుకుంటా.

'నువ్వు బలేవోడివిరా. ఆడపిలకాయలు పెద్దమనుషులయ్యాక వాళ్లని కొట్టకూడదని రూలు ఉందిరా. అందుకే ఐవోర్లు వాళ్లని కొట్టరురా. మనక్కూడా పెద్దమనుషులమైనట్టు రుజువు ఉంటే బాగుండునురా. మనల్ని కూడా కొట్టుండేవాళ్లు కాదురా' అన్నాడు టంకు శ్రీనుగాడు.

'ఇంతకీ ఇప్పుడు ఏం చేద్దామనుకుంటున్నారా?' అన్నాడు శ్రీదరుగాడు.

నేను ఆలోచించినాను. పరిస్తితిని రగతపాతాల దాకా పోనీకుండా వీలైనంత మంచి మాటలతో చక్కబెట్టడమే మేలని అనిపించింది.

'ఏమీ లేదురా. ఒక చాన్సు ఇద్దాము. మాట్లాడి చూద్దాము. ఎంత కటినాత్ముడికైనా లోపల రొంతైనా తడి ఉంటుందిరా. ఎంఆర్ ఐవోరు మన ముందర గంబీరంగా ఉన్నా వాళ్ల ఫ్రెండ్సుతోటి నవ్వతా మాట్లాడటం చూసినానురా. నవ్వతా ఉండే మనిషికి ఏ మాటైనా నచ్చ జెప్పడం బలే సులువురా. ఐవోరితో రేపు మాట్లాడదాములా' అన్నాను నేను.

'సరేరా' అన్నారు అందరూ.

మరుసటి రోజు సాయంత్రం ట్యూషను ఒదిలి పెట్టినాక అందరం ఎంఆర్ ఐవోరి ఆపీసురూములోకి వెళ్లి ఆయన ముందర నిలబడి మా బాదంతా చెప్పుకున్నాం.

ఆయన మొదట కళ్లు పెద్దంగా చేసి, ఆనేక అంతా విని, పొడుగు సిగరెట్టొకటి కాల్చి, చాలా సేపు రింగులు రింగులుగా పొగలతో ఆలోచించి అప్పుడు మాట్లాడినాడు.

'సరేరా అయితే. మీ అందరికీ ఆడపిలకాయల ముందర తన్నులు తినడం అంత నామోషీగా ఉందిగాబట్టి, యీపున వాత పడకుండా మీరు దారికిరారు గాబట్టి, నాకు ఎప్పుడు తన్నాలనిపిస్తే అప్పుడు– 'ఒరే. ట్యూషను ఒదిలినాక మీరుండండిరా. డౌట్లు క్లియరు చేసి పంపిస్తా' అని అంటాను. మీరు ఆగిపోవాలి. పిలకాయలందరూ ఎళ్లిపోయినాక మిమ్మల్ని నా ఆపీసురూములోకి తీసకొచ్చి కుంగా సావగొడతాను. సరేనా?' అన్నాడు.

'అబ్బా. సరే సార్. మీరంత మాటన్నారు అదే చాలు సార్' అన్నాము మేము.

ఆ రోజు నుంచి ఆ సంవచ్చరం పొడుగుతా మా ఎంఆర్ ఐవోరు ఆయనకి ఎప్పుడు బుద్ధి పుడితే అప్పుడు 'ఒరే. మీరుండండిరా. డౌట్లు క్లియరు చేసి పంపిస్తా' అని అనడం, మమ్మల్ని ఆపడం, ఆపీసు రూములోకి తీసకెళ్లడం, సావగొట్టి పంపడం...

ఇట్టా తోమీ తోమీ సాదీ సాదీ మహా మహా మొద్దులైన పులిచేరి శ్రీహరిగాణ్ణి, టంకుశ్రీనుగాణ్ణి, కేశవరాజుగారి అబ్బాయి మదుసూదనరాజుగాణ్ణి, నన్నూ టెన్తు ప్యాసయ్యేటట్టు చేయగలిగినాడు మా ఎంఆర్ ఐవోరు.

నిజంగా మేము ఈ రోజు యిట్టా ఉన్నామంటే ఆ పుణ్యంలో మా ఇశ్వోదయతో పాటు మా ఎంఆర్ ఐవోరికి కూడా బాగం ఉంది.

మాకు టెన్తులు అయిపోయాక కూడా మా ఎంఆర్ ఐవోరు ఇట్టానే చాలా మందిని పైనం చేస్తా దారికి తెస్తా పుణ్యం మూటగట్టుకుంటా ఉండేవోడు . అయితే ఆ తర్వాతర్వాత కొత్త కొత్త టుటోరియల్సు వచ్చి, కాంపిటీషను పెరిగి, ఎటు ఐవోర్లు అటు ఎళ్లిపోయి పాపం మా ఎం.ఆర్. టుటోరియల్సు మూత పడిపోయింది.

ఇప్పుడు మా ఎంఆర్ ఐవోరు హైదరాబాదులోనే ఏదో కోచింగు సెంటరులో పని చేస్తా పిలకాయలకి 'డౌట్లు క్లియరు' చేసే పనిలో ఉన్నాడని చెప్పినారు మొన్న కావలి పోతే.

ఈ కత ఆయనకి.

■